# వగపేటికి చల్ల చిందినన్

ఒక చివర తులసమ్మ. వేరొక చివర మురళీకృష్ణ. ఆ యిద్దరికీ మధ్య పరివ్యాప్తమయ్యే వృత్తాంతం ఇది. తులసమ్మ దగ్గరినుంచీ మొదలెడితే దీన్ని ఎవ్వరూ చదువరేమోనేన్న భయం నాకుంది. ఎందుకంటే తులసమ్మ కథ చెప్పగా విన్నవాళ్ళ హృదయాల పాలిటికి రంపాలకోత. యుద్ధ ప్రమాదలు ముంచుకొచ్చి, జీవన వ్యయాలు హద్దుమీరి, ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునేదాకా యిబ్బందులతోడిడే బ్రతుకైపోయిన రోజుల్లో విషాదగాథల్ని వినే ఓపిక ఎవరికుంటుంది?

ఎవ్వరికీ ఉండదు. అలాంటి సందేహానికి ఆస్కారం లేకుండా మురళీకృష్ణను గురించి నిర్భయంగా చెప్పుకోవచ్చు. పదిమంది ఒకచోట కలిసినప్పుడు కులాసాగా చెప్పుకుని వినోదించడానికి అనువైన కథే మురళీకృష్ణది. కానీ వచ్చిన చిక్కేమిటంటే వినోదమూ, విషాదమూ ఒకే ఒక నాణానికి బొమ్మా, బొరుసూ మాత్రమే! నాణెంతో కాసేపు ఆడుకోదలిచినప్పుడు, బొమ్మలాగే బొరుసు గూడా కంటబడక తప్పదు!

ఐతే ఒకపని చేయవచ్చు. బొరుసు కనిపించగానే కళ్ళు మూసుకుని నాణాన్ని తల్లక్రిందులు చేయడం చిటికలోపని! కథలో విషాదంపాలు ఏమాత్రం తగ్గినా తగ్గినట్టే!

పట్టణంలో బస్సుదిగి అరమైలుదూరం నడిస్తే ఓ చిన్నమేడ కనుపిస్తుంది. మేడ పైభాగంలో ఉన్న ఓ చిన్నగదిలో మురళీకృష్ణ నివాసం. మురళీకృష్ణ స్వార్జితంగానీ, పిత్రార్జితంగానీ కాదుగనుక ఆ మేడను గురించిన వివరాలతో మనకట్టే ప్రసక్తి ఉండదు. నెలకు పదిహేను రూపాయల అద్దె తమది కాదనుకుంటే ఆ గదిలో ఎవరైనా ఉండవచ్చు. అద్దెడబ్బులైతే నికరంగా చెల్లిస్తాడు గానీ, మురళీకృష్ణ ఎప్పుడుబడితే అప్పుడు గదిలో కనిపించడు. ఊళ్ళో అతనికి ఉద్యోగం ఉంది, ఉద్యోగానికి సెలవులొస్తే మిత్రులున్నారు. మిత్రులెవరూ కనిపించకపోతే గ్రంథాగారాలున్నాయి. గ్రంథాలయాలు మూసేస్తే అర్థరాత్రివరకూ మేలుకునే సినీ మందిరాలున్నాయి. ఎన్నివున్నా మధ్యాహ్నానంతరం వీధుల్లో వడగాడ్పులు నిప్పులు చెరిగిపోసే వేళల్లో మురళీకృష్ణకు ఆగది ఆపత్సమయంలో సుగ్రీవుడికి ఋష్యమూకంలాంటిది. తారురోడ్డుపైన అరమైలు దూరం నడిచి, మేడమెట్లెక్కి ఓరవాకిలిగా వేసిఉన్న రెక్క తలుపులు తెరిచేసరికి చల్లటిగదిలో తెల్లటి దూదిపరుపుమీద హాయిగా నిద్రిస్తూ ప్రత్యక్షమౌతాడు మురళీకృష్ణ. నిద్రాభంగం పాపహేతు వౌనో కాదోగానీ, అది మురళీకృష్ణ విషయంలో కోపకారణం మాత్రం అవును. మూగపోయిన మురళి నిద్రలేచి గాలిపోసుకుని మళ్ళీ నాదాలు కుమ్మరించే దాకా అల్మారాలో కనిపించిన కొత్త పత్రికలనో, పాత కావ్యాలనో చూస్తూ కూర్చోడ మొకటే గత్యంతరం!

వెళ్ళినవాడి అదృష్ట దురదృష్టాలను బట్టి కాస్త తొందరగానో, కాదా మరీ ఆలస్యంగానో నిద్రలేస్తాడు మురళీకృష్ణ. లేచి కూర్చోగానే ఆగంతకుడు అతనికి కనిపిస్తాడు. మురళీకృష్ణ కళ్ళు

పెద్దవౌతాయి. నుదురు కుంచించుకుపోతుంది. ముక్కుపుటం పైకిలేస్తుంది. మరొకటి, మరొకటి గాదు, అదంతా స్వాగత సంరంభమన్నమాట! ఎప్పుడొచ్చావు, ఎక్కడినుంచీ రాక, ఏమిటి విశేషాలు మున్నగు ప్రశ్నల వర్షానికి అతడి ముఖంలోని కదలికలు మౌనవ్యాఖ్యానాలన్నమాట!

పిందెను తీసుకొచ్చి మాగబెట్టడానికి ప్రయత్నించడం ఎంతటి తెలివి తక్కువపనో, అందుకు సంసిద్ధం కాకమునుపే మురళీకృష్ణను మాటల్లోకి దించదలచుకోడం అంతటి వెర్రిపని. శుద్ధ సాత్వికాభినయంతోనే స్వాగత కార్యం నిర్వర్తించిన మీదట బక్కపలచటి శరీరంలో ఈమూలకొకటిగా, ఆమూలకొకటిగా చెల్లాచెదరైపోయిన శక్తులను కూడగట్టుకోటానికన్నట్టుగా అయిదునిమిషాలో, పదినిమిషాలో అలాగే స్తబ్దంగా కూర్చుంటాడు మురళీకృష్ణ. ఆతరువాత నింపాదిగా ముఖప్రక్షాళనం, తదనంతరం అతడి చూపులు సూటిగా గోడపైకి వెళ్తాయి. అక్కడచీలకు వ్రేలాడుతూ ఒక ఫ్లాస్కులో ఉన్న కాఫీలో కొంచెం అతిధికి భాగంపెట్టి మిగిలిన గ్రుక్కెడు తానే సేవిస్తాడు మురళీకృష్ణ. మురళి గాలిపోసుకుంటున్న దన్నమాట! ఇక ఎదుటివాడు సావధానంగా ఉండవచ్చు. నాదం ఉప్పతిల్లబోతుంది గనుక!

మురళీకృష్ణను నేను చిన్నతనంనుంచీ ఎరుగుదును. అతడిలోని లోపాలను, దోషాలను వ్రేలెత్తిచూపి వాళ్ళూ వీళ్ళూ కోపతాపాలు ప్రకటించినప్పుడు 'ఆ:, కుర్రతనం లెద్దురూ' అని అతణ్ణి వెనకేసుకొచ్చిన మిత్రుల్లో నేనూ ఒకణ్ణి. తనలోని గుణాలతోనూ, దోషాలతోనూ అలాగే పెరుగుతూ వచ్చిన మురళీకృష్ణ, చిట్టచివరకు తనను వెనకేసుకొచ్చిన మిత్రులకు సైతం అర్థంకానంతటి క్లిష్టమైన వ్యక్తిగా రూపొందాడు. ఫలానాసంఘటన ఎదురైనప్పుడు అతడి ప్రవర్తన ఫలానావిధంగా ఉంటుందనిగానీ, ఫలానా ప్రశ్నకు అతడి జవాబు ఫలానావిధంగా ఉండవచ్చుననిగానీ ఊహించడానికి వీలులేకపోవడం మురళీకృష్ణలోని ప్రత్యేకత. ప్రాణమిత్రుణ్ణి గురించిన ప్రసక్తితెచ్చి 'అతడెలా ఉన్నాడని' ప్రశ్నిస్తే చింతగా ముఖంపెట్టి 'అతడీ వూళ్ళోనే ఉన్నాడా?' అంటాడు మురళీకృష్ణ. 'ఫలానా సినిమా చాలా బాగుంది. బహుశా చూసే ఉంటావు' అంటూ ముందరికాళ్ళకు బంధంవేస్తే 'ఆపేరుతో సినిమాగూడా వచ్చిందా? అలాంటిపేరుతో ఓ పుస్తకం చదివినట్టు జ్ఞాపకం' అంటాడు మురళీకృష్ణ. 'అతడీమధ్య ఆ మిత్రుణ్ణి కలుసుకోలేదా ఆ సినిమా చూచి ఉండడా' అని ప్రశ్నిస్తే - కలుసుకుని ఉంటాడు, చూచి ఉంటాడు అన్నదే నా సమాధానం. ఐతే అత డెందుకిలా చెబుతున్నాడు? నాకు స్ఫురించే కారణం ఒక్కటే! తనను గురించిన నిజాలు సాధారణంగా సామాన్య మానవుల ఊహాపరిమితికి అందవన్న భ్రమను కలిగిస్తాడు మురళీకృష్ణ. ఆ భ్రమలో తన ఉద్దేశం తల్లక్రిందులై నందుకు, తన అంచనా తారుమారు అయినందుకు ఎదుటివ్యక్తి కించపడిపోవడం సహజం. అప్పటికప్పుడు అలా ఎదుటివాడిలో కించపాటును సృష్టించి దానిపైన తన ఆధిక్యతను ప్రతిష్టించి దానిద్వారా తన విశిష్టతను చాటుకోడం అతడి అభిమతమేమో మరి!

తన స్వభావంలోని వైచిత్రిమాత్రం మినహాయించి చూస్తే మురళీకృష్ణ ఎంతో స్నేహపాత్రుడుగా కనిపిస్తాడు. అతడి కెందరో స్నేహితులున్నారు. కొందరు చెరువులో అలల్లాంటివారు. ఎదురైతే మందహాసమాత్రమైన పరామర్శతో అలాగే ముందుకు సాగిపోతారు. కొందరు మొగిలిపువ్వుల్లాంటివారు. దూరంనుంచీ పలకరించి, బాగున్నావా అంటూ కుశలమడిగి జనంతో కలిసి మాయమైపోతారు. కొందరు పరుగిడుతున్న మెట్టపొలంలో కాలికితగులుకునే ఆనపతీగల్లాంటివారు. రోడ్డుపైన తారసిల్లి గంటల తరబడి వూకదంపుడు ప్రసంగాలకు పూనుకుంటారు. ఈరకం మిత్రులు తమ సశేష ప్రసంగాన్ని మళ్ళీ రోడ్డుపైన సమాగమం సంగటించేనాటికి వాయిదా వేసుకుని విడిపోతుంటారు. పోగా మురళీకృష్ణను వెదుక్కుంటూ అతడి గదిలోకి వెళ్ళి బాతాఖానీకి కూర్చునే మిత్రులు సైతం లేకపోలేదు.

కానీ వాళ్ళల్లోనైనా మురళీకృష్ణ ఎక్కడివాడు, ఎందుండి వచ్చాడు, ఎక్కడికి వెళ్తున్నాడు అన్న వివరాలు తెలిసినవాళ్ళు చాలా తక్కువ. దాదాపు మృగ్యమని చెప్పినా చెప్పవచ్చు. మురళీకృష్ణ నివసిస్తున్న పట్టణమేదైతే ఉందో అది సిమ్లాకాదు, డార్జిలింగు కాదు. ఉదకమండలమైనా కాదు. దేశం ఏ మూలనుంచో వచ్చి వేసవికాలపు విశ్రాంతి ప్రదేశంలో నాలుగురోజులు గడిపిపోయేవాళ్ళల్లోనైతే యిలాంటి తాత్కాలిక స్నేహాలు ఆశ్చర్యం కలిగించవు. మామూలు ప్రపంచంలో స్నేహానికున్న విలువ వేరు. మహానుభావు డెవరో సృష్టిలో తియ్యనది స్నేహమేనని చెప్పనే చెప్పాడు. ఒకసారి ఆమాట మురళీకృష్ణతో చెప్పాను గూడా! అతడు నవ్వాడు. 'ఆయన నిజంలో సగం మాత్రమే చెప్పాడు. మిగిలిన సగం నేను చెబుతాను. శ్రుతి మీరితే అంతటి బాధాకరమైనది గూడా వేరొకటి ఉండదు' అన్నాడు మురళీకృష్ణ.

తన మానసిక ప్రపంచంలో మురళీకృష్ణ నాకిచ్చిన స్థానమెలాంటిదో నాకు తెలియదు. అప్పుడప్పుడూ నే నతని ఆంతరంగిక విషయాల్లో జోక్యం కలిగించుకునేమాట మాత్రం నిజం. అందుకు కారణం లేకపోలేదు. చెట్టుపెట్టినవారు దానిలోనుంచీ కాయలు కోసుకోవడమనేది సభ్య మానవ సమాజంలో ఒక న్యాయం. లోకం కంటికి చక్కటి సన్నజాజి పందిరిలా భాసిస్తున్న మురళీకృష్ణ జీవితానికి పాదులు కట్టి, నీరుపెట్టి అది ననలు తొడిగినప్పుడల్లా పరవశించిపోయిన వాళ్ళను గురించి నాకు తెలుసు. తన అభివృద్ధికి ఎక్కడినుంచైతే అది సత్తువను గ్రహించిందో అక్కడివాళ్ళకు దాని అందచందాలు, సుమసౌరభాలు ఒక్కింతగానైనా వినియోగపడితే, బాగుండునన్నదే నాకోరిక. మురళీకృష్ణ మాటల్లోనూ, చేతల్లోనూ అందుకు విరుద్ధమైన లక్షణాలు పొడగట్టినప్పుడల్లా నేను మృదువుగా మందలించే నేరానికి పాల్పడేవాణ్ణి.

పెద్దమనసుచేసి నాకామాత్రం చనువు ప్రసాదించాడు మురళీకృష్ణ. లేకపోతే నేను మురళీకృష్ణను మందలించడమేమిటి? అతడు బాగా చదువుకున్నవాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. లలితకళ లన్నింటిలోనూ తనకున్న కొంచమో నంచమో పరిచయాన్ని పురస్కరించుకొని పదిమందిని మెప్పించగలిగినవాడు. నగరంలో పేరెన్నికగన్న వ్యక్తిగా చలామణి కావడానికి కావలసిన హంగులు - లేదా ఆ హంగుతాలూకు అంకురాలు మురళీకృష్ణలో పుష్కలంగా ఉన్నాయి. తెలిసినవాడికి తెల్పడం మిక్కిలి సులభమంటాడు భర్తృహరి. అసలు తెలిసినవాడికి ఒకరు మళ్ళీ తెలియజెప్పవలసిన అవసరం ఏముంటుందన్నదే నా సందేహం! అందుచేతనే గావచ్చు. క్రమక్రమంగా మురళీకృష్ణకు సలహాలిచ్చే అనవసరమైన బాధ్యతకు స్వస్తి చెప్పుకోడానికే ప్రయత్నించాను.

కానీ తన కిష్టంలేని పని ఏదైతే ఉందో, దాన్ని తప్పనిసరిగా చేయవలసిరావడం మానవుణ్ణి తరచుగా ఎదుర్కొనే ధర్మసంకటాల్లో ఒకటని నా కప్పట్లో తెలియదు.

* * *

ఏదో పనిబడి ఒకసారి పట్టణంవెళ్ళాను. మురళీకృష్ణకు బదులుగా, వేసిన తాళంతో మూసిన తలుపులు ప్రత్యక్షమయ్యాయి. అది మురళీకృష్ణకు సెలవురోజు. బయట గ్రీష్మతాపం యింకా తగ్గలేదు. మేడ క్రిందిభాగంలో కాపురమున్న వాళ్ళని అడిగి చూచాను. మురళీకృష్ణ ఊళ్ళో లేడని తెలిసింది.

ఎక్కడికి వెళ్ళాడన్న ప్రశ్నకు మాకు తెలియదన్నదే వాళ్ళ సమాధానం.

రోడ్డుపైకి వచ్చేశాను. బజార్లో అంగళ్ళు ఎక్కి దిగుతుండగానే ఎండలు చల్లబడ్డాయి. మిగిలిన ప్రొద్దు మరికొన్ని స్వంతపనులు చక్కబెట్టుకోడానికి సరిపోయింది. తరువాతి కార్యక్రమమేమిటో పాలుపోక, ఆలోచిస్తూ మెల్లగా నడుస్తున్నాను. నాలుగురోడ్ల కూడలిలో రామభద్రం ఎదురయ్యాడు.

"ఏమండీ! ఎప్పుడొచ్చారు వూరినుంచి?"

చెప్పాను.

"ఇలా ఎక్కడికి వెళ్తున్నారు?"

చెడ్డచిక్కే వచ్చిపడింది నాకు. నికరంగా ఒక గమ్యస్థానం చెప్పకపోతే రామభద్రం నన్ను తన గృహాన్ని పావనం చేయమంటాడు. అలాంటి పనికి సాహసించి, రామభద్రం ప్రసంగ వాగ్ధారిలో మునిగితేలి తలనొప్పి కొనితెచ్చుకోడం నాకిష్టంలేదు.

"సినిమాకు" అంటూ అబద్ధంతో ఆత్మరక్షణకు పూనుకున్నాను.

"సినిమాకు ఒంటరిగా వెళ్తారా మీరు?" రామభద్రం కొండంత ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"జంటగా ఎలా వెళ్ళగలను? సహధర్మిణి ఊళ్ళోనే ఉంది."

"అబ్బే, అదిగాదండీ మేష్టరుగారూ, సాధారణంగా మురళీకృష్ణను వదిలిపెట్టరే మీరు."

"నిజమే! కానీ ఏం చేయను? మురళీకృష్ణ ఊళ్ళోలేడు....."

"లేకపోవడమేమిటి? ఉన్నాడండీ! నిక్షేపంగా ఉన్నాడు. ఇప్పుడే చూచాను. పెట్టె, పరుపు, కూలీచేత మోయించుకుని వెళ్తుంటే అడిగాను. ఎక్కడో నెల్లూరుజిల్లాలో పెళ్ళట! వెళ్లొస్తున్నా నన్నాడు..."

రామభద్రానికి మిత్రమండలిలో 'సమయ సంజీవి' అన్న బిరుదం ఉంది. ఒకరికి ఫోను చేయాలి. బ్యాంకులో చెక్కు మార్పించుకోవాలి. ఆఫీసులో అర్జీ సంగతి కనుక్కోవాలి. అర్జంటుగా ఓ వర్తమానం తెలుసుకోవాలి. నిమిషాల్లో యిలాంటిపనులు చక్కబెట్టగల చాకచక్యం రామభద్రం సొత్తు.

రెండోదఫా వెళ్ళేసరికి మురళీకృష్ణ ప్రయాణంచేసి బడలిపోయి వచ్చిన కారణాన కాబోలు, పైపై దుస్తులన్నీ ఊడదీసి కాళ్ళొకవైపుకు చేతులొక వైపుకు తోటకూరకాడల్లా వ్రేలాడవేసి వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

గదిలో అడుగిడగానే అతడు పలకరించాడు.

"ఎప్పుడు?"

మధ్యాహ్నమనగా వచ్చానని చెప్పుకున్నాను.

కొంతసేపు మౌనంగా కూర్చున్న తర్వాత పెదవులపైకి ఓ చిరునవ్వు తెచ్చుకుని "విశేషాలు?" అన్నాడు.

"విశేషాలేమైనా ఉంటే నువ్వే చెప్పాలి. ఎక్కడో పెళ్ళట. వెళ్ళొస్తున్నావట!" అంటూ ఓ కుదుపు కదిపాను.

పెళ్ళిమాట చెవినిబడగానే మురళీకృష్ణ కళ్లలోకి వెలుగులొచ్చేశాయి, ముఖంలోకి ఉత్సాహం వచ్చేసింది. అతడు వాలుకుర్చీలో నిటారుగా కూర్చున్నాడు.

"పెళ్ళంటే పెళ్ళా అది! మన ప్రాంతంలోనూ పెళ్ళిళ్ళు జరుగుతాయి. దానిముందు ఇవి దిగదుడుపుకైనా పనికిరావు...."

"నీలాంటటివాడి మెచ్చికోలుకు పాత్రం కావడంలోనే దాని గొప్పతనం తెలిసిపోతోంది. వివరాలు చెబితే చాలు. పెళ్లెవరికి? ఎక్కడ? ఎలాంటి సంబరాలు జరిగాయి?"

బస్సు దిగి మార్గమధ్యంలో కాఫీతోసహా ఉపాహారం గూడా సేవించి వచ్చినట్టున్నాడు మురళీకృష్ణ. దండిగా బొగ్గూ, నీళ్ళూ వేసుకున్న యింజనులా ప్రారంభమైంది ప్రసంగం. వీరరాజుగారిని ఓ గొప్ప భూస్వామి. రాజకీయాల్లో ఆయన పాత్ర చాలా ఉంది. తరచుగా

వార్తాప్రపంచంలో వినవచ్చే పేరాయనది. ఆయనే కన్యాదాత. వధూవరు లిద్దరూ విద్యాధికులే! పెళ్ళికి పెద్ద పెద్ద తలకాయలు చాలావచ్చాయి. దక్షిణాది నుంచి పేరుపొందిన మేళగాళ్ళు వచ్చారు. వంటలెంత బాగున్నాయంటే, వాటిని చేసింది నలభీముల్లో ఎవరో మురళీకృష్ణ ఏర్పరించి చెప్పలేకపోయాడు. ఈ విశేషాలన్నీ ఒక ఎత్తయితే వరకట్నాన్ని గురించిన ఉదంతాన్ని ఒక ఎత్తుగా చెప్పాడు మురళీకృష్ణ.

"అదే, అదే, నాకు తెలుసు. వరకట్నమనగానే నువ్వు తృళ్ళిపడతావని నాకుతెలుసు. ప్రభుత్వం నిషేధించింది గనుక యిక దాని ప్రసక్తికే తావుండగూడదని నీ ఉద్దేశం. అదెలా పొసగుతుందో నువ్వు ఆలోచించవు. భోగంవృత్తి కూడదనుకోడంలో అర్థముంది. మద్యపానం వద్దనుకోవడంలో అర్థముంది. కానీ వరకట్నాలకు అడ్డుకాలేమిటి? మళ్ళీ స్త్రీలకు సమానహక్కులు కావాలని మాత్రం చెబుతారు! ఇప్పుడీ వీరరాజుగారన్న పెద్దమనిషినే తీసుకో! ఆయన వరకట్నమన్న పేరుతో కుమార్తెకు పాతికవేల రూపాయలిచ్చాడనుకో! (ఇంకా ఎక్కువే ఇచ్చి ఉంటాడని మురళీకృష్ణ అంచనా!) అమ్మాయికాబట్టి అంతటితో సరిపోయింది గానీ, అదే అబ్బాయి అయితే చచ్చినట్టు ఆస్తిలో వాటా పంచిపెట్టవలసిందే గదా!"

తేలిన సారాంశం వరకట్నాలు యిచ్చుకోడంలోనూ, పుచ్చుకోడంలోనూ తప్పులేదని!

ఐనా నాకు తోచిన పద్ధతిలో మురళీకృష్ణ వాదాన్ని పూర్వపక్షం చేయడానికే ప్రయత్నించాను.

"మాట వరుసకంటున్నావుగానీ వరకట్నాలమూలంగా ఏర్పడుతున్న అనర్థాలు నీకు మాత్రం తెలియవా మురళీ! మనకళ్ళముందర ఎన్ని సంసారాలు గుల్లయిపోలేదు?"

"దానికేం చేద్దాం! ఎంత చెట్టుకు అంతగాలి! ఎవ్వ రివ్వదగిన కట్నం వాళ్ళిచ్చుకోడం ఉచితం...."

"కానీ యిచ్చుకోదగినంత కట్నానికి మంచి వరుడు దొరక్కపోతే?"

"అందు కెవరు మాత్రం ఏం చేయగలరు? నాకు తోచినంతలో గంతకు తగిన బొంతను ఎన్నుకోడం ఉత్తమమని నేనూ ఒక ఉపాయాన్ని సూచించే ఉన్నాను...."

పూర్తిగా వ్యాపార సరళిలో దిగి మాట్లాడుతున్న మురళీకృష్ణతో ఆ విషయంపైన యింకా రచ్చను పొడిగించడం వృథాయాసమనిపించింది.

"పోనీ నేను నీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాననుకో మురళీ! నువ్వు చదువుకున్నావు. ఉద్యోగం చేస్తున్నావు. ఇక పెళ్ళి ఒక్కటే బాకి! అది సమీప భవిష్యత్తులోనే ఉందని ఆశిద్దాం. ఏమాత్రం కట్నం ఆశిస్తున్నావు నువ్వు?"

"ఎలా చెప్పగలను? అదృష్టం కలిసిరావాలి. అది కలిసివస్తే ఎందుకూ పనికిరాని వాజమ్మలు సైతం లక్షలు పలుకుతారు..."

"పోని పనికివచ్చే వాజమ్మలు అందులో సగం దక్కినా పలకరా మురళీ?"

కొంటెకుర్రవాడి చిలిపిమాటల్ని పట్టించుకోని వయోధికుడిలా గంభీరంగా కూర్చున్నాడు మురళి. చెబుదామా వద్దా అని తటపటాయించినట్టుగా కాసేపు వూరుకుని, ఆపైన మెల్లగా ఉపక్రమించాడు-

"సెటిలయ్యే దాకా ఎవరికీ చెప్పకూడదనుకున్నాను. నీకు చెప్పినా పరవాలేదు. ఇప్పుడిప్పుడే ఆఫర్లు వస్తున్నాయి...."

"అలాగా మురళీ! ఎక్కడినుంచి వస్తున్నాయవి?"

"ఎక్కడినుంచైతే నేమిగానీ నెలరోజులనుంచీ ఒకటేగోల, మధ్యవర్తి ఒకాయన వేపుకతింటున్నాడు. ఆకాడికీ నేను నోరుతెరచి అడిగింది లేదనుకో! తనంతట తానే రథాన్ని పదిహేనువేలదాకా

లాక్కొచ్చాడు..."

తీరా ధరలు పడిపోయిన తరువాత విచారిస్తూ కూర్చునే వర్తకుడిలా దీనంగా అడిగాను "ఒప్పుకోలేకపోయావా మురళీ!"

మురళి ముఖంలో రంగు మారింది. "నాన్సెన్స్! లోకం ఎలా ఉందో తెలియదు నీకు! అదే - జిల్లాలోనైతే మనం యాభై అరవై వేల దాకా ఆశించవచ్చు...."

భావికాలంలో పదకోశాలు తయారుచేసేవాళ్ళకు ఉపకరించవచ్చునన్న ఉద్దేశంతో ఒక మనవి - పై మాటల్లో ఒకచోట మురళీకృష్ణ 'లోకం' అన్నాడు. అది పెళ్ళిళ్ళ మార్కెట్టు అన్న సంకర సమాసానికి పర్యాయపదం. పనిలోపనిగా యింకొక మనవి. అతడి మాటల్లోనుంచి జిల్లాపేరు ప్రయత్నంపూర్వకంగానే తీసివేయబడింది. కారణం వూహాకందనిదేమీ కాదు. పేరు చెబుతే ఆ జిల్లావాళ్ళకు కోపమైనా రావచ్చు, లేదు - గర్వమైనా కలుగవచ్చు. ఆ రెండు ఉద్వేగాలూ ఆరోగ్యానికేమంత మంచివిగావు.

మురళీకృష్ణ స్వభావాన్ని పరిశీలించడంలో నేనందాకా విస్మరించిన సరిక్రొత్త పాతవిషయం ఒకటి నాకప్పుడు జ్ఞప్తికి వచ్చింది. మురళీకృష్ణ జాగరూకుడు! ఎట్టి పరిస్థితిలోనైనా తన మెలకువలో తా నుండనేర్చినవాడు. కొమ్ములుతిరిగిన డాక్టరు గారికి వైద్యవిద్యలో ప్రాథమిక పాఠాలు బోధించడం ఎలాంటిదో అతడికి సలహాలివ్వడం అలాంటిది.

ఐనా మళ్ళీ - ఈసారి వేరొకదిశనుంచి చర్చను కొనసాగించాను.

"చూడుమురళీ! ప్రపంచంలో డబ్బుకున్న ప్రాధాన్యం నాకు తెలియకకాదు. ఐనా కీడెంచి మేలెంచడం మంచింది. జీవితపథంలో నీకొక అమ్మాయి తారసిల్లుతుంది. చక్కనిచుక్క. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. గుణగణాలకు, సత్సాంప్రదాయానికి లోటులేని కుటుంబం. ఎటొచ్చీ వాళ్ళే మంత కలిగినవారు కాదు. కట్నాలు కుమ్మరించలేరు. ఆ పరిస్థితిలో ఏం చేస్తావు నువ్వు?"

మురళీకృష్ణ ఫక్కున నవ్వేశాడు - "నాకేమంత ఒళ్లెరుగని శివమా! లోకం గొడ్డుపోలేదుకదా! ఆమాత్రం అందం ప్రపంచంలో మరెక్కడా కనిపించబోదన్న కక్కుర్తి ఏముంది? కత్తి బంగారందని గొంతు కోసుకుంటారా ఎవరైనా?"

తేలిపోయింది. ముందు జాగ్రత్త ఒక్కటి మినహాగా మిగిలిన అన్ని ప్రలోభాలనుంచి విముక్తుడై మురళీకృష్ణ తేలిగట్టున కూర్చున్నాడని స్పష్టంగా అవగతమైపోయింది.

శ్రమ తీసుకుని అతడు తన ఆంతర్యాన్ని విశదీకరించాడుగూడా!

"కత్తిపైన సాము, ఏటి కెదురీత, తనకుమాలిన ధర్మం. ఇవే ఆదర్శాలనుకోడం మానవుడికొక చెడ్డ అలవాటై పోయింది. నన్నడిగితే అమల్లో పెట్టడానికి వీలున్నదేదో అదే ఆదర్శమంటాను. లోకం మెరమెచ్చుకోసం ఆశపడి బీదింటి అమ్మాయిని పెళ్ళాడి భావికాలంలో అదే లోకంచేత బ్రతకలేనివాడిక్రింద జమకట్టబడటానికి నే నొప్పుకోను. ఇప్పుడు నాకు వందా యాభై రూపాయల జీతమిస్తున్నారు. ఎంత పొదుపుగా వాడుకున్నా పట్టణంలో వంద రూపాయలు లేనిదే బ్రతకడం సాధ్యంకాదు. పెళ్ళయ్యాక నాజీతం సంసారానికి చాలవచ్చు. చాలకపోవచ్చు. పోనీ సరిపెట్టుకుంటామనుకో! కుటుంబ జీవిత మన్నాక కొన్ని హంగులు తప్పనిసరి! అవి లేకపోతే 'గృహమే కదా స్వర్గసీమ' అన్న పాటను త్రిప్పించి పాడుకోవలసి వస్తుంది. కనీసపు అవసరం ఓ యిల్లు, పదివేలు పెట్టందే యిల్లు దొరకదు. ఇల్లుకొన్నాము. వట్టింట్లో బ్రతకలేము గదా! ఫర్నీచరు కావాలి. రేడియో ఉండాలి. ఈముఖ్యావసరాల కన్నింటికీ నాకు డబ్బు ఎక్కడనుంచి వస్తుందని నీ ఉద్దేశం?"

ఆపాటికి బాగా చీకటిపడిపోయింది. ఇంటాబయటాగూడా దీపాలు వెలిగించుకుని తన

పనులేవో తాను చేసుకుపోతోంది పట్టణం. పుస్తకంలో నుంచి మీల్సు టిక్కెట్లు రెండు చించుకుని మురళీకృష్ణ భోజనానికి వెళ్లొద్దామన్నాడు. ఆకాశవాణి సంగీతంతోబాటుగా అయ్యరుగారి భోజనం గూడా బాగుండడంతో హోటల్లోనుంచి ఈవలికి వచ్చేసరికి తొమ్మిది దాటింది. నాలుగురోడ్లు త్రిప్పించి మిల్కుబారులోపలికి తీసుకెళ్ళాడు మురళీకృష్ణ. అక్కడినుంచీ సినిమాథియేటరకు దారితీశాడు. రాత్రంతా యించుమించు జాగరణగానే గడవడంతో ఉదయం నిద్రలేచేసరికి ఆలస్యమైంది. మొదటి బస్సు అందదు. రెండోబస్సు పన్నెండుకుగానీ లేదు. ఏదో పనుందని మురళీకృష్ణ తొమ్మిదింటికే ఆఫీసుకు వెళ్ళిపోయాడు. నాకూ కొంతపని మిగిలి ఉండడంమూలాన మండీలవైపు బయల్దేరాను. మండీ ఆసాములు తలుపులు తెరిచి తక్కులు సర్దుకుంటున్నారు.

ఓ వసారాలోనుంచీ పిలుపు వినిపించింది. తిరిగి చూచాను. తులసమ్మ కనిపించింది.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు నాయనా! బాగున్నావా? ఎప్పుడొచ్చావు? మురళీకృష్ణ కనిపించాడా?"

ఆమె పదేళ్ళనాటి తులసమ్మలా లేదు. రక్తమాంసాలు అస్థిపంజరం పైన యిమిడిపోవడంతో ఆమె కృష్ణవర్ణ దారుశిల్పంలా ఉంది. తలవెంట్రుకలు ఎండిపోయిన కసువుపోగుల్లా గాలికి కదులుతున్నాయి. జీవితం చిట్టచివర 'ఏమి మిగిలింది?' అంటూ ఎదురయ్యే ప్రశ్నకు ఆమె ఏమని జవాబు చెప్పగలుగుతుంది? అదిగో - నుదుట కానీ కాసంత కుంకుమబొట్టు మాత్రం మిగిలింది. జీవితాన్ని తరచి తరచి చూచిన పెద్దలు భారతదేశపు సతీత్వ మనగా కష్టాలు భరించడం, కన్నీరు నించడం మినహాగా మరేమీ కాదన్నారు. జీవనసాగరంలో ఆడదానికి ఐదవతనం ఒక చిన్న తెప్పలాంటిది. నిరంతర దుఃఖ ఝంఝామారుతాలకు తావలమైన జీవన సాగరంలో దిగంతాలదాకా చేస్తున్న పయనంలో ఆఖరు మజిలీదాకా ఆ తెప్ప తోడు ఒక్కటి దక్కితే చాలు. అంతకంటే తులసమ్మ లాంటి వాళ్ళు కోరదగిన దేమంది?

చుట్టూరా కలయజూచాను. గోడప్రక్కన గంప ఒకటి కనిపించింది. గంపలో మట్టి కుండలున్నాయి. ఒకటి మజ్జిగదుత్త. వేరొకటి పెరుగు కుండ. ఇంకొకటి నెయ్యిముంత. పోయేనాడు పూచికపుల్లయినా వెంటరాదనడానికి నిదర్శనంగా మూడు కుండలూ ఖాళీగానే ఉన్నాయి. తమ కుక్షిలో నుంచీ పట్టణంలో నివసిస్తున్న భాగ్యవంతులకోసం ఎంత పెరుగు, ఎంత మజ్జిగ, ఎంత నెయ్యి సరఫరా అయిఉంటుందో వాటికేం తెలుసు? నాగరిక సమాజం దృష్టిలో విలువలేని దౌర్భాగ్యపు వస్తువులు మట్టికుండలు. మానవుడికి ప్రాణ వస్తువులాంటి పాడి దినుసుల్ని పదిలపరచి పంచిపెట్టడమొక్కటే వాటికి తెలుసు! రుచిచూచే అదృష్టం వాటి నుదుట భగవంతుడు వ్రాసిపెట్టలేదు.

తులశమ్మకు ఊళ్ళో నాలుగైదు ఆవులున్నాయి. ఓపిక ఉన్నా, లేకున్నా జరాభారమూ, రుజా ప్రకోపమూఎంతగా పీడిస్తున్నా ఆవుల్ని తోలుకెళ్ళి పొలాల్లోనూ కొండ కోనల్లోనూ త్రిప్పుకురావడం నరసయ్య వంతు. కుక్కి తట్టనిండుకూ చెక్కుడు బారతో గడ్డి చెక్కి తీసుకరావడం తులసమ్మవంతు. రెండు పూటలా తిండి వండుకునే వెసులుబాటు తులసమ్మకు అందుబాటులేని సుఖం, అల్లంత దూరాన ఆమె కనిపించగానే ఆవులు గడ్డికోసం, దూడలు పాలకోసం పగ్గాలతో గింజులాట ప్రారంభిస్తాయి. ఆవులకు మేతబెట్టి, దూడల్ని పాలకు విడిచి, పిండుకున్న పాలను కుంపటి మీద కెక్కించి, అదనెరిగి తోడుబెట్టి ఆవలింతలతో ఆమె మేను వాల్చేసరికి ఊరి కనురెప్పలమీద నిద్రాదేవత హాయిగా సేదదీరి ఉంటుంది. ఆ ఊళ్ళో తెల్లవారుజామున సైరను మ్రోగదు.కానీ ఆ ప్రశాంత వాతావరణంలో పట్టణం తాలూకు సైరను మ్రోత బాటలూ తోటలూ దాటి వంకలూ, వాగులూ దాటి పొలాలూ బీళ్ళూ దాటి

ఆ కుగ్రామంలోని కుటీరాల్లోకి సన్న సన్నగా వినిపిస్తుంది.

పట్టణానికి పల్లెకూ అయిదుమైళ్ళ దూరం. తులసమ్మకు రెండు గంటలు పట్టే కాలినడక.

"మురళి కనిపించలేదా బాబూ?" మళ్లీ అడుగుతోంది తులసమ్మ.

కనిపించాడని చెప్పాను.

"ఏమంటున్నాడు?"

"ఏమంటాడమ్మా? ఈ లోకానికి సంబంధించిన విషయాలన్నింటిపైనా మురళీకృష్ణకు స్వంతమైన అభిప్రాయాలున్నాయి. ఇంతకూ నువ్వడుగుతున్నది దేన్ని గురించి?"

"అదే నాయనా - పెళ్ళిమాట!"

సిటీలో చదువుకునే రోజుల్లోనైతే సెలవుల్లోనైనా యింటిముఖం చూడక తప్పేదిగాదు మురళీకృష్ణకు. పట్టణంలో ఉద్యోగమైన తర్వాత సెలవులతో బాటుగా యింటికి రాకపోకలు గూడా సన్నగిల్లిపోయాయి. కుమారుణ్ని కలుసుకుని ముఖాముఖిగా మాట్లాడే అవకాశాలు తులసమ్మకు చాలా తక్కువ. అధవా మాట్లాడినా అతడిభాష తులసమ్మకేమర్థమౌతుంది గనుక! చదువుకోసం బస్తీకి పంపిననాటి నుంచీ కుమారుడి భాష తనకర్థం కావడానికి ఆమెకు దుబాసీలు అవసరమౌతూ వచ్చారు. ఎక్స్‌కర్షను వెళ్ళాలి. అర్జంటుగా వంద రూపాయలు - అంటూ తంతిలా ఒక జాబు వస్తే తులసమ్మకు వ్యాఖ్యానం కావలసి వచ్చేది - సువిశాలమైనది భారతదేశం. మహాబలిపురంలో రాతి రథాలున్నాయి, హంపీలో శిథిలాలున్నాయి. హైదరాబాదులో సాలారుజంగు మ్యూజియం వుంది. అజంతాలో గుహామందిరాలున్నాయి. మనిషి బావిలో కప్పలా బ్రతికేం లాభం? అలాంటి దృశ్యాలు చూచి పుట్టువును సార్థకం చేసుకోవాలి. ఎక్స్‌కర్షనంటే విహారం. అలాంటి ప్రదేశాలకు వెళ్ళిరావడ మన్నమాట! - ఈ విధంగా కొనసాగే టీకా తాత్పర్యాలపై మళ్ళీ కొన్ని ప్రశ్నలు వుత్పన్న మయ్యేవి. రాతిరథాలంటే అవి ఎలా వుంటాయి? సాలారుజంగు అనే ఆయన సాయిబా? మేడలూ మిద్దెలూ చూడాలిగానీ శిథిలాలు చూడడ మేమిటి? గుహల్లో చీకటిగదా, లోపలికి వెళ్ళడం ఎలా సాధ్యం? దాని బ్రతుకు దానికి హాయిగానే గడచిపోతుడంగా యిప్పుడు బావిలోని కప్పకు వచ్చిన కష్టమేమిటి?

తులసమ్మకు సమాధానం చెప్పుకోవడంలో చెట్టును అటునుంచి నరుక్కురావడమే మేలనిపించేది - లక్షాధిపతుల బిడ్డలు - జమీందార్ల అబ్బాయిలు, కాలేజీలో చదువుకుంటారు. వాళ్ళకాలొకచోట నిలవదు. హమేషా తమాషాగా దేశాలపైన తిరిగిరావడం వాళ్ళ వ్యాసంగాల్లో ఒకటి. వాళ్ళతో కలిసి చదువుకుంటున్నాడు గనుక మురళీకృష్ణ కూడా నలుగురితోబాటు నారాయణా అనక తప్పదు - ఈ చిట్కా, యింద్రజాలంలా పనిచేసేది తులసమ్మపైన! గొప్పవాళ్ళ సాహచర్యంలో మెలగుతున్న తన కుమారుడు ఆ మాత్రం ఖర్చులకు వెనుదీయడం నామోషీకదూ! నూరు ఆరైనా, ఆరు నూరైనా అప్పోసప్పో చేసి తాను కుమారుడి పరువు నిలబెట్టుతుంది. అప్పే చేస్తుంది. తిరిగి వచ్చి వాడు ఉద్యోగంలో చేరితే అప్పులు చప్పున ఎగిరిపోవూ!

ఇప్పుడు తులసమ్మ తెలుసుకో గోరుతున్నది - పెళ్ళిని గురించి మురళీకృష్ణ ఏర్పరచుకున్న అభిప్రాయం.

అదామెకు చూచాయగా నైనా తెలిసివుండదా? ఏమో తెలిసివుండకపోవచ్చు.

"అదేమిటమ్మా! కష్టపడి చదివించి యింతవాణ్ణి చేశావు. అతడొక ఇంటివాడైతే పరమానందం కలిగేది నీకు! నీ యిష్టమేమిటో చెప్పగూడదూ?" అన్నాను.

"నాదేముంది నాయనా! నన్ను ఊరుపొమ్మంటుంది. కాడురమ్మంటోంది. ఇంట్లో ఓ

ముసలాయన వున్నాడు. ముగ్గురు కూతుళ్ళు కాపురాలు చేసుకుంటున్నారు. మేమెవ్వరమూ వాడిపెట్టు పోతలకైతే ఆశించడం లేదనుకో! కాని పండుగా పబ్బమూ జరిగినప్పుడైనా వాడు ఇంటికి రావద్దూ! రెండు మూడేళ్ళ కొక్కసారైనా యింటబుట్టిన ఆడబిడ్డలు ఇంత పసుపు కుంకుమ కోసం ఆశించరూ! ఎవరో ఒక మహారాజు పదివేలో పాతికవేలో పోసి పెళ్లిపీటల పైన్నుంచీ అలాగే లాక్కెళ్ళిపోయిన తర్వాత వాడు మనవాడని చెప్పుకోడానికైనా వీలుంటుందా బాబూ?"

గడ్డు ప్రశ్నతోనే ఎదురైంది తులసమ్మ.

"చెప్పు నాయనా! అంత డబ్బుపోసి అల్లుణ్ణి గడించుకున్న తర్వాత వాళ్ళకు అబ్బాయి పైన హక్కు ఏర్పడక పోతుందా?"

ఎందుకేర్పడదు? ఏర్పడేదే అది!

"బాబ్బాబు! నీకు పుణ్యముంటుంది. ఎలాగైనా వాడికి నువ్వు నచ్చచెప్పాలి. ఈనాడు డబ్బు ముఖం చూస్తే మమకారాలు నిలవ్వు. పుటుక్కున తెగిపోతాయి. ఆడబిడ్డలు కన్నీళ్ళు పెట్టుకుంటారు. ముసలాయన కృంగిపోతాడు. 'అత్తా' అని ఆప్యాయంగా పిలిచి ఆకులో అన్నం పెట్టి దగ్గరగా కూర్చునే కోడలు దొరికితే చాలునాకు!"

ఎవరు లేనప్పుడు వాళ్ళమాట మాటాడ్డమే మంచిది. "ఐతే ఓ పల్లెటూరి పిల్లను తీసుకొచ్చి నీకుమారుడికి కట్టబెట్టాలనుకుంటున్నావటమ్మా?" అని కాసేపు మురళీకృష్ణ పక్షానే నిలబడటానికి ప్రయత్నించాను.

"ఎందుకూ! పల్లెటూళ్ళల్లో మాత్రం చదువుకున్న అమ్మాయిలు లేరాబాబూ! పల్లెయినా పట్నమయినా మన తాహతుకు తగిన సంబంధం మనకు చాలు. పెంచి పెద్దచేసిన దూడను అమ్ముకుంటే నాకు పదిరోజులు నిద్రపట్టదు. ఆ దూడ కలల్లోకి వస్తుంది. కొట్టంలో బోసిగా వున్న కట్టుకొయ్య కనిపిస్తే ప్రాణం ఉసూరుమంటుంది. నీకు చెప్పాలా నాయనా! మమకారాల సంగతి నీకు తెలియదూ?"

మండీలో పనివుండి వచ్చిందేమో "ఉండునాయనా! ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది తులసమ్మ.

చొక్కా చేతిని పైకి మడిచి ముంజేతి కంకణాన్ని ప్రదర్శించినట్టుగా క్రితంరోజు రాత్రి మాటల సందర్భంలో మురళీకృష్ణ వివాహంపై తన స్వాభిప్రాయాన్ని సుస్పష్టం చేశాడు. అనతికాలంలో అదేవిషయంపైన మధ్యవర్తిత్వం నెరపవలసి వస్తుందని అనుకోలేదు. తీరా రాయబారానికి పూనుకుంటే మురళీకృష్ణ వైఖరి ఎలావుంటుంది?

అయిదు నిముషాల్లో తిరిగి వచ్చింది తులసమ్మ. "వెళ్ళొస్తాను బాబూ! మరచిపోకుండా మురళితో మాట్లాడి వెళ్తావుగదూ?" అంటూ తేలిగ్గావున్న గంపను తలపై కెత్తుకుంది.

తిరిగి వెళ్లిపోతున్న వాలకాన్ని బట్టి చూస్తే దేనికోసం ఆమె మండీలవైపు వచ్చిందో ఆ కార్యం సానుకూలమైనట్టు లేదు.

ప్రశ్నించాను.

గోసంపదతో బాటుగా ఆ కుటుంబానికి రెండెకరాల పొలం కూడా ఉంది. కౌలు కివ్వగా పదిమూటల బెల్లం యిల్లు చేరింది, చెరకు బెల్లానికి గిరాకీలేని రోజులు. బండి బాడుగ పెట్టి సరుకును మండీకి తోలించుకోవలసి వచ్చింది.

"డబ్బివ్వటానికి మండీవాళ్ళు గడువు పెడుతున్నారటమ్మా?" అడిగాను.

"అబ్బే, వాళ్ళు నిక్కచ్చి మనుషులు బాబూ! గడువులు పెట్టేరకం కాదు. నాకేనా ఆ డబ్బుతో పనేముంది? బాండుకు వాయిదా పోతోందని ఓ పెద్దమనిషి పీకలపైన కూర్చుంటున్నాడు. దీన్ని తీసుకెళ్లి ఆయన కడ్డుపెడదామనుకున్నాను..."

అనుకున్న దొకటైతే జరిగేది వేరొకటి. డబ్బుకోసం వెళ్ళేసరికి మండీ ఆసామి తెల్లబోయి "ఇంకా ఏం డబ్బమ్మా! మొన్ననే మీ అబ్బాయి పట్టుకెళ్ళాడే!" అన్నాడు.

"వాడి సంసారం వాడేమైనా చేసుకోవచ్చు. ఏనా అవసరం తగలకపోతే వాడైనా ఆ డబ్బుతో ఏం చేసుకుంటాడు? పోనీలే నాయనా! ఈ సంగతి మాత్రం అడగొద్దు..."

'అలాగేనమ్మా' అన్నాను.

దృక్పథంలోనుంచీ వైదొలిగేదాకా ఆ వృద్ధురాలి వైపునుంచీ చూపులు మరల్చుకోలేకపోయాను. చురకత్తి అంచుల్లా వచ్చి లోకంపైన విడిసిపోతున్ని దినకరుని కిరణాల తీక్ష్ణ స్పర్శకు ఆమె శరీరం అలవాటు పడిపోయింది. బుస్సునలేచి పాదాలపైన పేరుకునే బాటలోని బూడిద దుమ్ముమినహాగా ఆ పాదాలకు పాదరక్షలు లేవు. తలపైన గంప వినా ఆతపత్రం సున్న. దారిప్రక్కన ఆకులు రాల్చుకుని నీడ నివ్వడానికి మారాం చేసే చింతచెట్లు. అవైనా ఫర్లాంగుకు ఒకటి, రెండు మాత్రం. ఏ రక్షణా లేక శీతోష్ణస్థితుల కోపతాపా లన్నింటికీ నృత్యరంగమై పోయిన శరీరాన్ని ఈడ్చుకుంటూ ఎడారి ఎండల్లో మోయరాని బరువును మోస్తూ వెళ్తున్న లొట్టిపిట్టలా జీవనయాత్రాపథం వెంట సాగిపోతున్న తులసమ్మకు చలువ పందిరిలాంటి సుఖం ఎప్పుడెదురౌతుంది?

సాయంకాలం అయిదు గంటలకు సరాసరి ఆఫీసుకే వెళ్ళి మురళీకృష్ణను కలుసుకున్నాను.

"ఊరికి వెళ్ళలేదా! మరీ మంచిది. ఈరోజే ఓ కొత్త సినిమా వచ్చిందట! ఫస్టు షోకే వెళ్దాం" అన్నాడు మురళీకృష్ణ.

ఓవైపుగా వెళ్ళాలనుకున్న తర్వాత ఈ బండిని మరోవైపుగా మళ్లించడం దుస్తరం. ఒకవేళ మళ్లించినా మతిపోయినంత పనౌతుంది. మురళీకృష్ణను వెంబడించక తప్పిందిగాదు.

సినిమా కొత్తదే. అల్లికలో కొత్త డిజైనుల్లా అక్కడక్కడా కొత్త సన్నివేశాలు ఎదురయ్యేమాట నిజమే! కానీ కథావస్తువులో ప్రత్యేకించి చెప్పుకోదగిన నూతనాంశ మేదీ లేదు. గుణం, రూపం, విద్యలాంటి వేవీ లేకపోయినా దండిగా కట్నాలు తీసుకొచ్చే సంబంధాన్ని నిర్ణయిస్తాడు తండ్రి. తన నిర్ణయానికి కట్టుబడకపోతే ఆస్తిలో ఓ చిల్లిగవ్వయినా కుమారుడికి దక్కదంటాడు. కట్నాన్ని తృణప్రాయంగా చూచి, తండ్రి గారి వైముఖ్యాన్ని సైతం ఎదిరించి, కమలనాభుణ్ణి, కాలదేశ వర్తమానాలను, శుక్రాచార్యుల శాపాన్ని ఎరిగిఉండి కూడా కోరికోరి అపాయాన్నే కొనితెచ్చుకున్న బలిచక్రవర్తికి మల్లే కథానాయకుడు ఆదర్శ వివాహం చేసుకుంటాడు.

భుజంపైన చేయివేసి మురళీకృష్ణ ముఖంలోకి చూస్తూ "నిజ జీవితాలకు విరుద్ధంగా అల్లుకుపోతే సినిమా కథలు తయారవుతాయేమో!" అన్నాను.

"మన మిక్కడ కొచ్చిందెందుకు? సినిమా చూడ్డానికా! దీనికీ నిజ జీవితానికి పాటా వేసి చూడ్డానికా! సినిమా ఎంజాయ్ చెయ్ మిత్రమా! మిగిలిన విషయాలు నీకెందుకు?"

హోటల్లో భోజనంచేసి శరీరాలను గదిలోకి చేరవేసేసరికి పదకొండు గంటలు కావచ్చింది.

"ఒకటి రెండు మాటలున్నాయి మురళీ! చాలా ముఖ్యమైన విషయం" అన్నాను.

"మాటలా! ఇప్పుడా? అబ్బో నిద్ర, నిద్ర, ఇప్పుడు సాధ్యం కాదు" అన్నాడు మురళీకృష్ణ.

"సాధ్యమో అసాధ్యమో, నేను చెప్పక తప్పదు. నువ్వు వినకా తప్పదు."

"ఇదేం ముప్పురా బాబూ! ఊఁ కానీయ్ మరి! తప్పుతుందా?"

"ఉదయం మండీల దగ్గర మీ అమ్మ కనిపించింది."

"కనిపించి?"

"ఎలాగైనా నీకు నచ్చచెప్పమని కోరింది..."

"చెప్పు."

"క్రొత్తగా చెప్పేదేముంది! రాత్రి మన తర్జన భర్జనల్లో నలిగిన విషయమే!"

"నా సమాధానాన్ని అప్పుడే చెప్పినట్టు జ్ఞాపకం...."

"ఆలోచించు మురళీ! తల్లి అభిప్రాయాన్ని త్రోసిరాజనటం న్యాయంకాదు."

"అందకు రెడీమేడ్ సమాధానం ఉండనే ఉంది. పెళ్ళి చేసుకోబేయేది నేను...." ఆవులిస్తూ పరుపుపైకి వ్రాలిపోయాడు మురళి.

విస్తరించి చెబుతే మురళీకృష్ణ దారిలోకి రావచ్చునన్న ఆశావేశం కొడిగట్టిన దీపంలా ఇంకా ఏమూలో దాగిఉంది. కానీ తల్లిని గురించి మురళీకృష్ణకు తెలియని విషయా లేమున్నాయి? తనకోసం ఆమె పడిన పాట్లన్నీ ఏకరువు పెట్టాను. ఆమె ఆశలను, ఆశయాలను ప్రతిఘటించకుండా వీలైనంతలో ఓ సమన్వయ పద్ధతిని ఎన్నుకోడం భావ్యమన్నాను.

అస్మదీయుడి కంఠశోష జోలపాటలా పనిచేసిందేమో - మురళీకృష్ణ గురకపెట్టసాగాడు.

తట్టి లేపి "నిద్రపోయావా మురళీ!" అన్నాను.

"నువ్వింకా మాట్లాడుతున్నా వేమిటి? పడుకోవయ్యా బాబూ! కంటారా నిద్రపోతే కాశీకి పోయినంత పుణ్యమట!" అన్నాడు మురళీకృష్ణ.

★ ★ ★

ఆరు మాసాల అనంతరం ఒకనాటి టపాలో ఆహ్వానం అందింది.

అదే ముహూర్తానికి ఒకానొక దగ్గరి బంధువుల యింట్లో శుభకార్యం తటస్థించింది. తుమ్మితేచాలు, ముక్కు ఊడిపోతుందనుకునే మనస్తత్వం వాళ్ళది. ఆ శుభకార్యానికి వెళ్ళకపోతే కలకాలం మాటపడవలసి ఉంటుంది. మురళీకృష్ణ విషయంలో అలాంటి చిక్కులేదు. అనివార్య కారణాల వల్ల పెళ్ళికి రాలేకపోయానని ఓ కార్డుముక్క వ్రాసి పడేస్తే చాలు. ఆపనే చేశాను.

కానీ మురళీకృష్ణ పెళ్ళికుమారుడైన వైనమూ, వైభోగమూ ఎలాంటివో తెలుసుకోవాలన్న కుతూహలం మాత్రం లోలోపల లేకపోలేదు. ఎలా తెలుస్తుంది? ఎవరికైనా వ్రాసి తెలుసుకుందామన్న కోరిక యింకా ఆచరణలోకి రానేలేదు. అంతదూరంనుంచీ రామభద్రం నా యింగితాన్ని ఎలాగో పసిగట్ట గలిగాడు. అతని దగ్గరనుంచి సుదీర్ఘమైన ఉత్తరం వచ్చింది.

నేను పెళ్ళికి గైర్‌హాజరైనందుకు ఆశ్చర్యం ప్రకటించాడు రామభద్రం. మరు వాక్యంలో 'పోనీలే, వెళ్ళిమాత్రం మేమేం బావుకున్నాము?' అంటూ అంతలోనే తన అభియోగాన్ని ఉపసంహరించుకున్నాడు.

పెళ్ళికి వెళ్లి ఎవ్వరైనా బావుకునే దేముంది? పెళ్లిళ్ళ మూలంగా ఎవరికైనా లభ్యమయ్యేది ఒకటే. రెండు పూటల తిండితోబాటుగా ఒక్కింత వినోదం. మరీ మహరాజులైతే ఆ తిండి, ఈ వినోదం కూడా వాళ్ళ అంతస్తుకు తగినంత హుందాగా ఉండేమాట నిజం. లేనిపోని విలువలకు పరిగణన యిచ్చి మురళీకృష్ణ నామర్దా సంబంధాలకు ఒప్పుకోడని నాకు బాగా తెలుసు. మరైతే రామభద్రం అసంతృప్తికి కారణ మేమై ఉంటుంది?

రామభద్రం లేఖ తాలూకు రెండో పేజీలో అందుకు ప్రత్యుత్తరం లభించింది.

"...... ఒక్కొక్క పంక్తికి రెండువందల మందికి చొప్పున వడ్డించగా, మధ్యాహ్న భోజనాలు పూర్తి కావచ్చేసరికి ప్రొద్దు బాగా వాటారిపోయిందంటే అక్కడ చేరిన జనసందోహం ఏపాటిదో వూహించుకోవచ్చు. ఆడపెళ్ళివారి బంధు బలగాన్ని గురించి ప్రత్యేకించి చెప్పడం అవసరం. మనుషుల సంగతలా ఉండగా వాళ్ళు తమ వెంట తెచ్చుకున్న పెట్టెలు, పరుపులు, బుట్టలు సంచుల్లాంటి సామానులతో విడిదిలోని గదులన్నీ నిండిపోయాయి, మిగిలింది హాలుమాత్రం. హాల్లో ఇసుకవేసినా రాలనంత జనం. ఎడతెగకుండా యింకా లోపలికి వస్తున్న బంధువులకు తావు చేయడంకోసం గొంతు చించుకుంటున్న పెళ్ళి పెద్దల హంగామాను కించపరుస్తూ సంగీత దేవతపైన నిర్దాక్షిణ్యంగా కసిదీర్చుకుంటున్న లౌడ్‌స్పీకర్లు. మధ్యలో అందరినీ ఆకర్షించే విధంగా సింగారాలు తీర్చిదిద్దుకున్న పెళ్ళి మండపం. ఆ మండపానికే కొన్ని వందల రూపాయలు ఖర్చయినట్టు వినికిడి. అంతా బాగానే ఉంది. కానీ వివాహానికంతా కీలకప్రాయమైన అతి ముఖ్యఘట్టమేదైతే ఉందో అక్కడే వెలితి కనిపించింది. కంకణధారణ, కాశీయాత్ర, నలుగులు నాగవల్లి లాంటి ఆచారాలేవీ లేవు. ఆఖరుకు ఎవరైనా అయిదు నిమిషాలపాటు కళ్ళు మూసుకుని పరధ్యానంలో పడిఉంటే, వాళ్ళు కళ్ళు తెరిచేసరికి పెళ్ళి జరిగిపోయిందన్న వర్తమానం తెలిసి ఉంటుంది. ఇదివరకే నిర్ణీతమైన కార్యక్రమానికి దారిలో అడ్డు తగిలిన వారి సంతృప్తికోసం కారుదిగి ఆదరాబాదరాగా ఒకటి రెండు మంచిమాటలు పలికిపోతున్న నాయకోత్తముల్లా వధూవరులు ముచ్చటగా కొద్ది నిముషాలు మాత్రమే పెళ్ళి పందిరిలో కనిపించారు. కనిపించారట - అనడం భావ్యం. ఎందుకంటే తమ పార్టీకి చెందని నాయకుడి ఉపన్యాసాన్ని దూరదూరంగా నిల్చుని వింటున్న రాజకీయవాదుల్లా పెళ్ళికుమారుడి మిత్రులు లోపల తావులేక పోవటంతో వసారాలోనూ, వీధుల్లోనూ నిల్చోవలసి వచ్చింది.

తలిసెట్టి రామారావుగారంటూ ఓ వ్యంగ్య చిత్రకారు లుండేవారు మునుపు. పెళ్ళిళ్ళలో వ్యక్తుల హోదాలను గురించి ఆయన ఓ చిత్రం వేశారు. ఆ చిత్రంలో పెళ్లికుమారుడి తల్లిదండ్రులు గలివరు బ్రాబ్డింగుకు నాగుదేశంలో కనుపించిన మహాకాయుల ఆకారంలోనూ, పెళ్ళికుమార్తె తల్లిదండ్రులు అదే యాత్రీకుడికి మరొక దేశంలో ఎదురైన లిల్లీపుట్టుల లాగానూ గోచరిస్తారు. సజీవులై ఉండి మురళీకృష్ణ పెళ్ళికి గనుక విచ్చేసి ఉండినట్టయితే రామారావు గారు ఆశ్చర్యాతిరేకంతో నిర్ఘాంతపోయి ఉండేవారు. పెద్ద ఎత్తున మహాసభలు నిర్వహిస్తున్న ఆహ్వానసంఘ అధ్యక్ష ఉపాధ్యక్షులకు మల్లే వధువు తల్లిదండ్రులు దర్పంగా మాట్లాడుతూ, హడావిడిగా తిరిగేస్తూ విడిదిలో ఎక్కడబడితే అక్కడ కనిపించారు. వరుడి తల్లిదండ్రులెక్కడన్న ప్రశ్న నిరుత్తరంగా ఉండిపోయింది. వాళ్ళు ఏమూల ఒదుగుళ్ళు పోయారో తెలియదు...."

నవ్వొచ్చింది నాకు. తమవల్ల ఏం తప్పిదం జరిగిందని వాళ్లలా ఒదుగుళ్ళుపోయి ఉంటారు? కుమారుడికి విద్యాబుద్ధులు చెప్పించడమే తల్లిదండ్రుల తప్పిద మనుకోడానికి మనసు అంగీకరించదు. కుమారుడికి సంఘంలో ఓ ఉన్నత స్థానం కల్పించి తా మక్కడికి చేరుకోలేక పోవడం వాళ్ళ తప్పిదమైతే కావచ్చు!

ఉన్నత విద్యాలయాల్లోనూ, కళాశాలల్లోనూ చదువుకుంటున్న తమ కుర్రవాళ్ళకు జాబులు వ్రాసిపెట్టమనీ మనియార్డరు ఫారాలు నింపమనీ యింటికి వచ్చే తల్లిదండ్రులవైపు చూస్తుంటే విస్మయం కలిగేది నాకు! వాళ్ళ ముఖాల్లో ఎందుకింత ఆనందం తాండవిస్తోంది? వీళ్ళకేపాటి న్యాయం జరుగుతుంది? అనాగతంలోకి తొంగించూచే దూరదృష్టినే గనుక భగవంతుడు ప్రసాదించి

ఉన్నట్టయితే, వీళ్ళు తమ బిడ్డలను ఊరి పొలిమేరలైనా దాటించేవారు కారేమో! ఇలాంటి సందేహాలు కలిగినప్పుడల్లా స్మృతి పథంలో మెదిలేవాడు మురళీకృష్ణ. ఒకటి రెండుసార్లు పట్టణానికి వెళ్ళినా అతణ్ణి కలుసుకోడం కుదిరింది గాదు. పెళ్ళయిన కొత్తలో అత్తగారింట కొన్నినాళ్ళు హాయిగా "ఇల్లరికం" గడిపినవాడై, ఆ తరువాత అతడు సతీసమేతంగా కొంత దేశం తిరిగి వచ్చాడన్న ఉదంతం మాత్రం మిత్రుల మూలంగా తెలిసింది.

ఓరోజు సాయంకాలం పట్టణంలో బస్సు దిగాను. ఆఫీసునుంచీ యింటికివెళ్తూ ఎట్టఎదుట తారసిల్లాడు రామభద్రం. రాజకీయ, సాంఘిక, సాహిత్యాద్యనేక విషయాల్లో కొత్త పరిణామాలను గురించి తెలియజెప్పడానికి వీలుగా నాలాంటి పల్లెటూరి వ్యక్తి ఒకడు ఎదురైన రోజు రామభద్రానికి పర్వదినం. మిగిలిన పరిణామాల మాటకేమిగానీ, మురళీకృష్ణ కథలో నూతనాంశాలను వినడానికి నేను సైతం శ్రద్ధాళువునుగాలేకపోలేదు.

"విశేషాలు చాలా ఉన్నాయి" అన్నాడు రామభద్రం. ఆ విశేషాల కన్నింటికీ అప్పటి కప్పుడే ఓ ఉపక్రమణిక తయారు చేశాడు. - "కొండ నాలుకకు మందువేస్తే అసలు నాలికే ఊడిపోవడానికి ఓ తార్కాణం చెప్పగలరా మీరు?"

"వినేవాడికి చెప్పేవాడు లోకువంటారు. నేను చెప్పను. వింటాను" అన్నాను.

రామభద్రం గొల్లున నవ్వేశాడు. "ఐతే నేనే చెబుతాను. ఇంతకాలానికి కుమారుడు తల్లి కష్టాన్ని గుర్తించాడు...."

సామెతకూ దృష్టాంతానికీ బొత్తిగా పొత్తు కుదరడం లేదు!

"పోనీ, వివరిస్తాను" అన్నాడు రామభద్రం. ప్రతిరోజూ పల్లెకూ, పట్నానికీ తిరగడం వల్ల ఆరోగ్యం చెడిపోతుందట! పైగా వృద్ధాప్యమాయె! తల్లిని యింటిదగ్గరే వుండిపొమ్మన్నాడు కుమారుడు..."

"ఇందులో అసలు నాలుక వూడిపోవడానికి ఆస్కారం లేదే!"

"అప్పులెవరు తీరుస్తారు?"

"అప్పులేం చేస్తాయి. ఆస్తిని ఆవరించగలవంతేగదా?"

"ఆ తెంపు వాళ్ళకుండద్దూ! చచ్చి సున్నమైనా సరే, కుమారుడికి ఆ ఆస్తి దక్కించి వెళ్ళాలన్నది వాళ్ళ తాపత్రయమైతే?"

"అప్పులు పెరగ్గూడదు. ఆస్తులు తరగ్గూడదు. పాము బడిత సామెతలా వుంది. ఈ చిక్కునెలా విప్పడం?"

"చిక్కు విప్పినంత పుణ్యం! అప్పుల మాట దేవుడెరుగు! పట్నానికి రాకపోతే పల్లెటూళ్ళో ఆ కుటుంబానికి జరుగుబాటెలాగో ఆలోచించరు మీరు!"

అదీ ఆలోచించవలసిన సంగతే!

ఆలోచనకు అడ్డుతగిలాడు రామభద్రం - "చదువక ముందు 'కాకరకాయ' అని, చదువుకున్న తర్వాత 'కరకరకాయ' అన్న వాడిలా వుంది మీ వ్యవహారం! ఏమిటండీ మీరు మరీనూ..." రామభద్రం విసుక్కుంటున్నాడు.

నా అజ్ఞతను నేను ఏవిధంగా వ్యక్తం చేశానో తెలియడం లేదు!

"నిజమే అప్పుడే నగరప్రవేశం చేసిన 'జంబో'ను అనేక విషయాలకు మన్నించవలసి వుంటుంది" అన్నాను.

క్షమాపణ కోరుకున్నట్టుగా తటాలున నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు రామభద్రం - "ఎంతమా టెంతమాట! ఇచ్చిన క్లూల సాయంతో మీరు అసలు సంగతి ఆకళించుకోగలరను కున్నాను..."

"ఎదుటివారి తెలివితేటలను గురించి గొప్పగా అంచనా వేయడానికి పూనుకుంటే యిక లోకంలో ఎవరిపనులు వాళ్ళు చేసుకోడం దుర్లభం! రాజకీయోపన్యాసాలకు తరచుగా వెళ్ళేవారు మీరు! మీకు తెలియని విషయమేమీ గాదు...."

"చంపేశారండీ మేష్టారుగారూ. ఇక పది నిముషాలు నేను తేరుకోలేను...."

బుజ్జగించి రహస్యమంటూ ఏదైనా వుంటే చెప్పమన్నాను.

"మీరైనా ఊహించలేనిదేమీ గాదు. పట్టణానికి తిరగడం వల్ల ఆరోగ్యం చెడిపోతుందనుకోడం మురళీకృష్ణ స్వభావానికి విరుద్ధం! మీదు మిక్కిలి అందువల్లనే ముసలావిడ ఆరోగ్యం బాగున్నదని చెప్పగలగడం అతడి తత్వం. పోగా వార్ధక్యమనేది హఠాత్తుగా యిటీవల మూడు మాసాల నుంచీ ప్రారంభమైన దేమీ గాదు. అప్పులు పెరగనిమ్మనిగానీ, ఆస్తి తరగనిమ్మనిగానీ అనుకునే అవివేకిగూడాకాదు మురళీకృష్ణ. ఈ పై బురఖాలన్నీ తీసిచూస్తే - వాస్తవం కనిపిస్తుంది."

"అదే అదే - అదే నాకు కావలసింది" అన్నాను.

"ఊళ్ళో శ్రీమతికి దండిగా బంధువులున్నారు. ఫలానా వ్యక్తి పాలు, పెరుగూ అమ్ముకుంటోందని తెలిస్తే అవమానం ఎవరికి?"

బదులుకు బదులు! జోడుగుండ్ల తుపాకీని ఆయువుపట్టుకు గురిపెట్టి ఠారుమని కాల్చినంత పనిచేశాడు రామభద్రం. ఈ దెబ్బనుంచీ కోలుకోడానికి పదినిముషాలు చాలవు.

పట్టుగ్రత్తో నరాలను బిగ్గరగా లాగిపట్టుకున్నట్టుగా బుద్ధి స్తబ్దమై పోయి, మనసు మంచుగడ్డలా బిగుసుకుపోయి, కాలదేశ వర్తమానాల స్పృహలేక మరమనిషిలా నడుస్తున్నానేమో, లారీల క్రింద సాగిలపడకుండా సైకిళ్ళకు ఢీ యివ్వకుండా రామభద్రం రోడ్డు ప్రమాదాలనుంచీ నన్ను రక్షించాడు.

"అన్నట్టు ఈమధ్య మీరు మురళీకృష్ణను కలుసుకోలేదా మేష్టారు గారూ?"

"నేనా! మురళీకృష్ణనా!" శూన్యంలోనుంచీ ప్రయాణం చేసివచ్చి వాతావరణంలోపడి ఊపిరి పీల్చుకోడానికి ప్రయత్నిస్తున్న ప్రాణిలా గిలగిల లాడిపోతున్నట్టున్న నావైఖరి రామభద్రానికి ఆశ్చర్యం కలిగించి వుంటుంది. కారణం చెప్పలేను. ఎందుకోగానీ నా అంతరంగంలోని కల్లోలాన్ని ఎదుటిమనిషి గుర్తించడం నాకిష్టంలేదు.

"వీలైతే ఈసారి కలుసుకోవాలి. కానీ అంతకంటే తొందరైన పనులున్నాయి. బజార్లో కొన్ని వస్తువులు కొనుక్కోవాలి. ఉదయం ఆరుగంటల రైల్లో ఓ మిత్రుడు తిరుపతినుంచీ హైదరాబాదు వెళ్తున్నాడు, ఏదో మాట్లాడాలని స్టేషనుకువచ్చి కలుసుకోమన్నాడు. ఆమాటలేవో విని, ఆపైన పెదకాపుగారి కోసం సర్కారెరువు సంగతి వాకబు చేయాలి. ఓ కుర్రవాడి స్కాలర్షిప్పుకోసం తాశీల్దారుగారిని సంధించాలి..."

వెళ్లొస్తానని చెప్పి ముందుకు సాగాను. పదిబారల దూరం నడిచానో లేదో వెనుకవైపునుంచీ మళ్ళీ పిలువు వినిపించింది.

"నా నోట్లో నువ్వుగింజయిన నానదండీ మేష్టారుగారూ! మీపాటుకు మిమ్మల్ని వదిలిపెట్టవచ్చుగదా! ఊహూ, నా మనసొప్పదు...." మరీ దగ్గరగా వచ్చి ఈసారి నిజంగానే ఏదో రహస్యం చెబుతున్నట్టుగా కొనసాగించాడు రామభద్రం. "ఇటుచూస్తే కుమారుడి ఆజ్ఞ, అటు చూస్తే సంసారం జరగదు. నుయ్యికీ

గొయ్యికీ మధ్య ముసలావిడ ఏం చేస్తుందో తెలుసా మేష్టారూ! బహుశా యిది నా కొక్కడికి మాత్రమే తెలిసిన రహస్యం. ఒకటి రెండు గంటలు ముందుగానే యింటిదగ్గర నిద్రలేస్తుంది. వచ్చి యధాప్రకారంగా వాడుకల వాళ్ళకు చల్లబోసి, సూర్యోదయం కాక మునుపే తిరుగుదారి పడుతుంది.

★ ★ ★

ఆరోజు రాత్రి నాకు తిన్నగా నిద్రపట్టినట్లు జ్ఞాపకం లేదు. మానవరక్తం రుచిమరిగిన మశకాలకు మత్కుణాలకు ఆటపట్టయినచోట ఆశ్రయం లభించింది. పీడకలలు వెన్నంటిన కలతనిద్రలో ఆగదిలోనే పడుకున్న మిత్రుడి గురక, రకరకాల శబ్ద విన్యాసంతో అడవి మెకాల అరుపుల్లా వినిపించింది. దారి తప్పి నడవడమనే దోషం నుంచీ మానవుడే వైదొగలలేనప్పుడు అతడిచేత నిర్మించబడిన యంత్రాలకు మాత్రం స్వధర్మ పరాయణత్వం ఎక్కడనుంచీ వస్తుందని అపహాస్యం చేసినట్టుగా సరిగ్గా అయిదింటికే లేపగల దనుకున్న అలారం గడియారం గూడా అరగంట ఆలస్యం చేసింది. ఆలస్యమైంది గనుక సైకిలు తీసుకెళ్ళమని సలహా యిచ్చాడు మిత్రుడు. చలికాలపు ఉదయం. మంచు ముమ్మరంగా ఉంది. ఉండిఉండీ వినిపిస్తున్న మునిసిపాలిటీవారి పాల సైకిళ్ళ హారన్లను మినహాయిస్తే నగరమంతటా నిశ్శబ్దం తాండవిస్తోంది. రాజవీధినే శరణ్యమనుకుంటే సకాలంలో స్టేషనుకు చేరుకోలేకపోవచ్చు. త్వరగా గమ్యస్థానానికి వెళ్ళిపడాలన్న తొందరలో సందుగొందుల అడ్డదారినే ఎన్నుకున్నాను. నగరం యింకా నిద్ర మేలుకోలేదు గనుక వీధులన్నీ నిర్మానుష్యంగానే ఉండగలవన్న ధీమాతో రివ్వున వెళ్ళిపోతోంది సైకిలు. ఉన్నట్టుండి ఒకచోట మలుపు తిరగవలసి వచ్చింది. మలుపులో మనిషే అడ్డురావడం జరిగిందో, లేక సైకిలేవెళ్ళి మనిషిపైన బడిందో చెప్పలేను. తటాలున సైకిలు దిగేశాను. క్రింద పడిపోబోయి గోడ ఒకటి ఆసరగా దొరకడంతో దానికానుకొని నిల్చున్న కృశీభూత శరీరం ఒకటి ఆ మసక చీకటిలో దృగ్గోచరమైంది. మనిషికి ముప్పు వాటిల్లనిమాట నిజమే! కానీ తలపైని గంప? అది భూపతనమైంది. కుండలు పెంకులై చెల్లాచెదురై పోయాయి. నేలపాలైన మజ్జిగ మున్నటి గారపైన దీనంగా జారిపోతోంది.

మన్నించమని అర్థించడానికి మాటలు స్ఫురించలేదని చెప్పను. అలాంటి మాటలు భాషలో లేకపోవచ్చు.

*(భారతి మాసపత్రిక, 1964)*